నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మోతీనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 11 కేవీ వివేకానందనగర్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాకేష్ కుమార్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో రైల్వే ట్రాక్, బవార్చి లైన్, వివేకానందనగర్ కమ్యూనిటీ హాల్, శివ డీటీఆర్ దగ్గర, వివేకానందనగర్ రోడ్డు నంబర్ 5 నుంచి 9 ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నామని తెలిపారు.

మూసాపేట: కైత్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్, జేవీఎస్ హైట్స్ అపార్టుమెంట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్టీసీ సమ్మెకు ఉద్యోగులు సిద్ధం


గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు, జేఏసీ నాయకులు

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద బుధవారం డిపో నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు సమ్మెకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు ఈదురు వెంకన్న, కమలాకర్‌గౌడ్, బాబు, సురేష్, సారంగి, అశోక్, మురళీ కృష్ణ, ఐలయ్య, రాంరెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత


సఫ్దార్‌నగర్ ప్రధాన రోడ్డులో నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ సఫ్దార్‌నగర్ ప్రధాన రోడ్డులోని కాముని చెరువు సమీపంలో అక్రమ నిర్మాణాలను తిరిగి ప్రారంభించారు. దీంతో బుధవారం జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక సిబ్బంది, కూకట్‌పల్లి రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల సంయుక్తంగా అక్రమ నిర్మాణాలను తొలగించారు. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభించిన డీసీపీ

దుండిగల్: ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో వాటర్ ప్యూరిఫయర్‌ను ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో స్టేషన్‌కు వివిధ ఫిర్యాదుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం తాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే చర్యలే!

- ఇప్పటికే నోటీసులు జారీ చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు
- మరోవైపు పైరవీకారుల జోరు
- నేరుగా సంప్రదించాలంటున్న అధికారులు

బాలానగర్, ఫతేనగర్ డివిజన్‌లు అంటేనే పారిశ్రామివాడలు. ఇక్కడ చిన్న తరహా పరిశ్రమలు అధికంగా ఉంటాయి. కొద్ది రోజులుగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ అధికారులు పలు పరిశ్రమల యజమానులకు, వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న వ్యాపార సముదాయాలకు తీసుకున్న ట్రేడ్ లైసెన్స్‌లకు ఎక్కడా పొంతన లేదు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వాళ్లు మాత్రం .. జీఎస్టీ చెల్లిస్తున్నామని, ఉద్యమ్ సర్టిఫికెట్ ఉంది కనుక తమకు మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలో 9661 వ్యాపార సముదాయాలకు 7, 982 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్స్ ఉన్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 11,305 ఉన్నాయి. ట్రేడ్ లైసెన్స్‌లు చాలా మంది తీసుకోవాల్సి ఉంది.
- బాలానగర్


ట్రేడ్ లైసెన్స్‌లో తీసుకోవాలని నోటీసులు జారీ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

ట్రేడ్ లైసెన్స్ పొందండి ఇలా

వ్యాపార నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రెంటల్ అగ్రిమెంట్, బిల్డింగ్ బ్లూ ప్రింట్, ప్రాపర్టీ టాక్స్, ఆధార్ పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అనంతరం అధికారులు విచారణ జరిపి ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తారు. ప్రధాన రోడ్డులో దుకాణాలు, చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాలు ఉంటే సంవత్సరానికి చెల్లించాల్సిన ఫీజు ఎస్ఎఫ్‌టీకి రూ.6, మిగతా రోడ్లలో ఎస్ఎఫ్‌టీకి రూ.4 చొప్పున ఉంటుంది.

ట్రేడ్ లైసెన్స్ లేకుంటే భారీ జరిమానా

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే భారీ జరిమానాలు విధించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వ్యాపారం చిన్నదైనా, పెద్దదైనా ట్రేడ్ లైసెన్స్ విధిగా ఉండాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. వ్యాపార సముదాయాన్ని పరిగణలోకి తీసుకొని ట్రేడ్ లైసెన్స్ పొందేందుకు ఫీజు ఉంటుంది. ఇప్పటికే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోని వారికి ముందస్తు సమాచారం ఇస్తున్నారు.

పైరవీకారుల జోరు

అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని నోటీసులు ఇస్తుండటంతో పలువురు చిన్న తరహా పరిశ్రమల యజమానులు, ఫ్యాన్‌ల తయారీదారులు రాజకీయ నాయకుల అనుచరులను సంప్రదిస్తున్నారు. పైరవీకారులు తమ నాయకుడితో చెప్పించి తక్కువ ధరకు ట్రేడ్ లైసెన్స్ ఇప్పిస్తామని వారితో బేర సారాలు సాగిస్తున్నారు. బాలానగర్ డివిజన్‌లో పైరవీకారుల జోరు ఎక్కువగా ఉంది.

ప్రభుత్వం మినహాయింపు ఇవ్వాలి



స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌కు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి పరిశ్రమలు నడుపుతున్నాం. అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ట్రేడ్ లైసెన్స్‌ల ఆవశ్యకతను తెలియజేయాలి. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తమ గురించి ప్రభుత్వం ఆలోచించి మినహాయింపు ఇవ్వాలి.
- వై. అలెక్స్, స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ యజమాని

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



వ్యాపారులు, చిన్న తరహా పారిశ్రామికవేత్తలు, దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. ట్రేడ్ లైసెన్స్‌ల కోసం తమను సంప్రదిస్తే పారదర్శకంగా త్వరితగతిన ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తాం. పైరవీకారులకు ఆస్కాం లేదు. ఎవరూ కూడా అలాంటి వారి నమ్మి మోసపోవద్దు.
- కార్తిక్, మూసాపేట సర్కిల్ ఏఎంహెచ్ఓ

అభివృద్ధి పనులపై సమావేశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. జాతీయ రహదారితో పాటు స్థానిక రహదారులపైన ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రద్దీ ఏర్పడి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మురుగు నీటి పారుదల పరిసర ప్రాంతాలు, చెరువులు, కుంటల్లో దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని, వాటిని కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు. కేపీహెచ్‌బీ కాలనీలోని నిర్మించాల్సిన వంద పడకల ఆసుపత్రి, మూసాపేట వై జంక్షన్‌లో నిర్మించాల్సిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి, రహదారుల విస్తరణ, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సమస్యలపై చర్చించారు.


జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో సమస్యలపై మాట్లాడుతున్న బండి రమేష్ తదితరులు

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: సైబర్ మోసాలు, నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పీఎస్‌ఆర్ ఎంపైర్ కాంప్లెక్స్‌లో హెల్ప్ ఫర్ సైబర్ విక్టిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజ హితం కోసం ఫౌండేషన్ స్థాపించి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి కొండంత అండగా నిలవటం గొప్ప విషయమన్నారు. ఎంతోమంది అభాగ్యులకు సంస్థ ఎంతో అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, జీడిమెట్ల సీఐ మల్లేశం, సంస్థ చైర్మన్ పులి అరవింద్, ఎర్రగడ్డ శ్రీనివాస్ యాదవ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి కీసరగుట్టలో క్రీడా పోటీలు

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 24 నుంచి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు, యువకులకు గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారి తెలిపారు. ఈనెల 24 నుంచి రెండురోజుల పాటు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు, 28 నుంచి మార్చి 1వ తేదీ వరకు యువకులకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 23లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్ 8106252751 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.


మూసాపేటలో నవయువక మండల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఉమాకాంత్ తదితరులు

ధీరత్వానికి మారుపేరు ఛత్రపతి శివాజీ

ధీరత్వానికి, ధైర్యానికి మారుపేరు ఛత్రపతి శివాజీ అని వక్తలు అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నేటి తరం యువత శివాజీ అడుగుజాడల్లో నడవాలన్నారు.
- కూకట్‌పల్లి(జోన్‌బృందం)


కూకట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న లాయర్లు


కబీర్‌నగర్ చౌరస్తాలో నివాళి అర్పిస్తున్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు


కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1లోని శివాజీ విగ్రహం వద్ద .. శేరి సతీష్ రెడ్డి తదితరులు

ఆలయ వార్షిక పూజలు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ నవజీవన్ నగర్ కాలనీ విజయ గణపతి సహిత శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి ఆలయంలో సిద్ధి బుద్ధి సహిత విజయ గణపతి ప్రతిష్ఠాపన సహిత ఆవాహిత ఉమామహేశ్వర శ్రీ బాలత్రిపుర సుందరి, పంచముఖి ఆంజనేయ స్వామి వారి అష్టదశ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ రాజేశ్వరరావుకు వేద ఆశీర్వాదం అందించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు తాండ్ర అరుణ్‌బాబు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శంకరరెడ్డి, బాలానగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్, డివిజన్ నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్, నవజీవన్ నగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి టీవీ భాస్కర్ రెడ్డి, సభ్యులు శ్రీరామమూర్తి, రాజ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, వెంకటస్వామి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.


రాజేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

హెచ్‌సీయూలో కళాబజార్



రాయదుర్గం: విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్య, కళాత్మక ఆవిష్కరణల 'ఆర్ట్ సౌక్-2025'ను హెచ్‌సీయూలో సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్‌లోని ఫైన్ ఆర్ట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 'ఆర్ట్' అంటే కళ అని, 'సౌక్' అంటే బజార్ అనే అరబిక్ పదం అని తెలిపారు. విద్యార్థులలో ఉన్న కళను ప్రోత్సహించడానికి వేదిక ఏర్పాటు చేశారు. ప్రతియేటా ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తారు. విద్యార్థుల పెయింట్‌లను, టెర్రకోట, సిరామిక్స్ శిల్పాలు, పేపియర్ మాచే మాస్క్‌లు, స్టోన్‌వేర్, ఆభరణాలు తదితరాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

పెద్ద ఎత్తున నిర్వహించిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలు చోట్ల మొక్కలు నాటారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనహృదయ నేత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అని నేతలు కొనియాడారు. నియోజకవర్గాన్ని 10 సంవత్సరాలుగా ఎంతో అభివృద్ధి సాధించిన ఘనత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకే దక్కుతుందన్నారు.


నేతాజీ పార్కులో మొక్కలు నాటుతున్న బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష, సతీష్ అరోరా


కేక్ కట్ చేస్తున్న ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు


జన్మదిన వేడుకల్లో పాల్గొన్న అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం


కట్టమైసమ్మ ఆలయం వద్ద కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ రోజాదేవి, గొట్టిముక్కల భాస్కర్‌రావు


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్


కేక్ కట్ చేస్తున్న బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, తదితరులు


ఎమ్మెల్యే నివాసం వద్ద కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ మహిళా విభాగం నేతలు


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు


జీఎల్‌ఎస్ రెడ్డి ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన కార్పొరేటర్ శ్రీనివాసరావు

నీటి సమస్య నివారణకు నిరంతర పర్యవేక్షణ

శివారుల్లో నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

- వేసవిలో ప్రతిరోజూ మానిటరింగ్
- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- బోర్లు, చేతిపంపుల మరమ్మతులు
- జీపీలు, పురపాలక సంఘాల్లో అదనపు వాటర్ ట్యాంకులు
- అవసరమైతే అద్దెకు తీసుకునేందుకు వ్యవసాయ బోర్ల గుర్తింపు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివార్లలోని 13 పురపాలక సంఘాలు , 34 గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించనున్నారు. ఓఆర్ఆర్ (లోపలి)పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారానికి జలమండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటుండగా, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో జిల్లా అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోంది.

3 డివిజన్లు / వార్డులకు ఒక ట్యాంకర్

నగర శివార్లలోని జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట నగరపాలక సంస్థలతో పాటు కొంపెల్లి, మేడ్చల్, దుండిగల్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్కేసర్ మున్సిపాలిటీల పరిధిలోని 3 డివిజన్లు/ వార్డులకు ఒక వాటర్ ట్యాంకర్‌ను కేటాయించనున్నారు. అవసరాన్ని బట్టి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రైవేట్ కమర్షియల్ బోర్లతోపాటు పట్టణానికి సమీపంలో గుర్తించిన వ్యవసాయ బోర్లను కూడా ఉపయోగించునేలా కార్యాచరణ ఖరారు చేశారు. మంచి నీటి సరఫరా పర్యవేక్షణకు జిల్లా కలెక్టర్ గౌతమ్ పురపాలక సంఘాల కమిషనర్లతో సహా ప్రత్యేక అధికారులను నియమించారు. వీరందరూ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్)రాధికా గుప్తా నేతృత్వంలో పని చేయనున్నారు. ఎండలు అధికమవుతున్న నేపథ్యంలో పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో పెట్టుకుని గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, అపార్టుమెంట్లల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రైవేట్ కమర్షియల్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక జనాభా కలిగి ఉన్న జవహర్‌నగర్ కార్పొరేషన్‌తోసహా పురపాలక సంఘాల్లో మంచినీటి సమస్య తలెత్తకూడదన్న లక్ష్యంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం పేర్కొంది.

పంచాయతీల్లోనూ పకడ్బందీ చర్యలు

34 గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచాయతీల్లోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు, వాటర్ ట్యాంకర్లు ఉన్నా, ప్రతి గ్రామానికి అదనంగా రెండేసి చొప్పున వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచినట్లు జిల్లా పంచాయతీశాఖ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే జూన్ వరకు మంచినీటి ఎద్దడి నివారణకు ఏ,బీ,సీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించిన పంచాయతీ శాఖ అవసరాన్ని బట్టి అద్దెకు తీసుకునేందుకు పలు వ్యవసాయ బోర్లను గుర్తించినట్లు తెలిసింది. ఇందులో ఘట్కేసర్ మండలంలో 38, కీసరలో 12, ఎంసీపల్లిలో 32 , శామీర్‌పేటలో 45, మేడ్చల్ మండలంలో 42 వ్యవసాయ బోర్లు అద్దెకు తీసుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే వ్యవసాయ బోర్లు ఉన్న భూములు సర్వే నంబర్లతో సహా రైతుల ఫోన్ నంబర్లు తదితర వివరాలను జిల్లా అధికార యంత్రాంగం సేకరిస్తోంది.